RNI-TELTEL/2017/72695

2 డిసెంబర్ 2022

# శుభ తెలంగాణ

శుక్రవారం | మేడ్చల్

సంపుటి : 5, సంచిక :273

ఎడిటర్: ఎన్ సీ శేఖర్

వెల: 4 రూ/.

Website: www.subhatelangana.in

Published From Medchal, Circulated at Jagtial, Jangaon, Jayashankar, Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri, Bhuvanagiri.




## రాష్ట్రాన్ని 5 లక్షల కోట్ల అప్పుల్లో ముంచిండు

### వేల కోట్లకు పడగలెత్తిన కేసీఆర్ కుటుంబం

### బెంగళూరు డ్రగ్స్ కేసులో ఐదుగురు టీఆర్ఎస్ ఎమ్మెల్యేల పాత్ర: బండి సంజయ్

- ప్రజా సంగ్రామ యాత్రలో భాగంగా నిర్మల్ లో మాట్లాడిన బీజేపీ నేత
- బెంగళూరులో టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డ్రగ్స్ దందా చేస్తున్నారన్న సంజయ్
- డబ్బులిచ్చి కేసు కొట్టివేయించుకున్నారని ఆరోపణ
- ఆ కేసును రీ ఓపెన్ చేయిస్తున్నామని వెల్లడి

హైదరాబాద్(శుభ తెలంగాణ): కర్ణాటక రాజధాని బెంగళూరులో వెలుగు చూసిన డ్రగ్స్ కేసుకు సంబంధించి బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్ గురువారం సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో తెలంగాణలో అధికార పార్టీ టీఆర్ఎస్ కు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేల పాత్ర ఉందని ఆయన ఆరోపించారు. ఈ కేసు ఇప్పటికే క్లోజ్ కాగా... ఈ కేసును రీఓపెన్ చేయిస్తున్నామని కూడా ఆయన

-మిగతా2లో

## రూ.1544కోట్లతో నల్లగొండ అభివృద్ధి

### చండూరును రెవెన్యూ డివిజన్ గా చేస్తాం...

### ఉపఎన్నికలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటాం

### అన్ని హామీలను నెరవేర్చిన తర్వాతే ఎన్నికలకు వెళ్తాం : మంత్రి కేటీఆర్

- ఉమ్మడి నల్గొండ జిల్లా అభివృద్ధిపై మంత్రుల సమీక్ష
- సంస్థాన్ నారాయణపూర్ లో గిరిజన గురుకుల పాఠశాలను ఏర్పాటు చేస్తామని ప్రకటన



హైదరాబాద్(శుభ తెలంగాణ): నల్లగొండ ఉమ్మడి జిల్లా అభివృద్ధి కోసం ఇచ్చిన వాగ్ధాలన్నీ ఏడాదిలో నెరవేరు స్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ప్రకటించారు. రాబోయే ఆరేడు నెలల్లో ఆర్అండ్‌బీ, పీఆర్, మున్సిపల్, గిరిజన సంక్షేమశాఖల ఆధ్వర్యంలో రూ.1544కోట్లు 12 నియోజకవర్గాల్లో ఖర్చు చేయబోతున్నట్లు ప్రకటించారు. నల్లగొండ బిడ్డల రుణం తీర్చుకునే ప్రయత్నం చేస్తున్నామన్నారు. 'ఉమ్మడి నల్లగొండ అభివృద్ధి, సంక్షేమం'పై మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రులతో కలిసి కేటీఆర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఒకే శాసన సభ నియోజకవర్గానికి ఐదుగురు మంత్రులు, పెద్ద ఎత్తున అధికారులు అరుదైన, అసాధారణమైన సందర్భం. మునుగోడు ఎన్నికల ప్రచార సభలో గెలిపిస్తే మునుగోడు, నల్లగొండను గుండెల్లో పెట్టుకుంటానని సీఎం కేసీఆర్ చెప్పారు' అని కేటీఆర్ తెలిపారు.

పనులు పూర్తి చేసే మళ్లీ ప్రజల్లోకి వెళ్తాం.. 'చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 1952లో ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యాక ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో ఏకపక్షంగా గులాబీ జెండా ఎగుర వేసి నల్లగొండ జిల్లా గులాబీ జెండాను ఎలాగైతే గుండెల్లో పెట్టుకున్నదో.. నల్లగొండ జిల్లా బిడ్డలు ఎట్లయితే సీఎం కేసీఆర్‌ను గుండెల్లో పెట్టుకున్నరో.. అదేస్థాయిలో తప్పకుండా అండగా ఉంటామని చెప్పేందుకు సీఎం కేసీఆర్ ఆదేశం మేరకు మంత్రులం నల్లగొండ జిల్లాకు వచ్చాం. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో అందరికీ పార్టీ కార్యకర్తలు పని చేయాలని సీఎం ఆదేశించారు. ఈ ప్రాంత సమస్యలు, పరిస్థితులు అధ్యయనం చేసే అవకాశం కలిగింది. మనుగోడు ప్రజలకు చేయదలుచుకున్న విజ్ఞప్తి ఒక్కటే.. గెలిపించింది కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని మాత్రమే కాదు..

-మిగతా2లో



## జీ-20 అధ్యక్ష బాధ్యతలను చేపట్టిన భారత్

- ప్రపంచంలో శక్తిమంతమైన కూటమిగా జీ-20
- ఏడాదిపాటు జీ-20 అధ్యక్ష స్థానంలో భారత్
- ఇటీవల ఇండోనేషియాలో జీ-20 సదస్సు
- ఇండోనేషియా నుంచి అధ్యక్ష బాధ్యతలు భారత్‌కు బదిలీ

-మిగతా2లో



## గ్రూప్ 4 నోటిఫికేషన్ విడుదల

- నోటిఫికేషన్ ను విడుదల చేసిన టీఎస్పీఎస్సీ
- మొత్తం 9,168 పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడి
- ఈ నెల 23 నుంచి జనవరి 12 దాకా దరఖాస్తులకు అవకాశం
- ఏప్రిల్ లేదా మే నెలల్లో పరీక్ష నిర్వహణ

-మిగతా2లో

## కేసీఆర్ పార్టీలో ఉన్నవాళ్లంతా తాలిబన్లే..

## నాకేం జరిగినా ప్రభుత్వానిదే బాధ్యత



- పాదయాత్రను అడ్డుకునేందుకే తనపై దాడి చేశారని ఆరోపణ
- సీఎం కేసీఆర్ డైరెక్షన్లో పోలీసులు తనను రిమాండ్ చేయాలనుకున్నారని వ్యాఖ్య
- గవర్నర్ తమిళిసైని కలిసి ఫిర్యాదు చేసిన వైఎస్ఆర్ టీపీ అధ్యక్షురాలు

-మిగతా2లో

## రూ.1.40 లక్షల కోట్లు దాటిన జీఎస్టీ వసూళ్లు

- నవంబరు మాసం వివరాలు తెలిపిన కేంద్రం
- గత నవంబరుతో పోల్చితే 11 శాతం అధికం
- అయితే ఈ ఏడాది ఆగస్టు నుంచి ఇదే అత్యల్పం




హైదరాబాద్(శుభ తెలంగాణ): గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (జీఎస్టీ) వసూళ్లకు సంబంధిం చిన నవంబరు మాసం వివరాలను కేంద్రం వెల్లడించింది. నవంబరు మాసంలో రూ.1.45 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైందని

-మిగతా2లో

## బీఆర్ఎస్ ఏర్పాటు బీజేపీని ఉలిక్కిపడేలా చేసింది

- బెదిరించడం వంటివి టీఆర్ఎస్ సైన్యం వద్ద పని చేయవన్న కవిత
- తెలంగాణ ప్రజలకు కట్టుబడి ఉన్నామని వ్యాఖ్య
- ప్రజలకు సేవ చేయకుండా తమను ఎవరూ ఆపలేరన్న కవిత



హైదరాబాద్(శుభ తెలంగాణ): ముఖ్యమంత్రి కేసీఆర్ ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ బీజేపీని ఉలిక్కిపడేలా చేసిం దని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. ద్వేషాన్ని పెంపొం దించడం, మతోన్మాదాన్ని ప్రచారం చేయడం, బెదిరించడం వంటివి టీఆర్ఎస్ పార్టీ సైన్యం వద్ద పని చేయవని చెప్పారు. తెలంగాణ ప్రజలకు తాము కట్టుబడి ఉన్నామని.... వారికి సేవ చేయకుండా

-మిగతా2లో

## ఢిల్లీలో మూడు రోజుల పాటు లిక్కర్ బంద్

- మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో లిక్కర్ బంద్
- నేడు సాయంత్రం నుంచి 4వ తేదీ సాయంత్రం వరకు నో సేల్స్
- డిసెంబర్ 7న కౌంటింగ్

-మిగతా2లో



## బీజేపీ పాలనలో అప్పుల భారతం

- ఒక్కో వ్యక్తిపై 1.24 లక్షల భారం
- తలాతోక లేని బండి వ్యాఖ్యలు
- పన్నుల్లో రాష్ట్రాలకు వచ్చేది 29.6%
- 42% లెక్కనైతే లక్ష కోట్లు రావాలి
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇప్పిస్తారా?
- జగిత్యాలలో మంత్రి హరీశ్ సవాల్
- సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



హైదరాబాద్(శుభ తెలంగాణ): : 8 ఏండ్ల పాలన దేశాన్ని బీజేపీ అప్పుల కుప్పగా మార్చిందని, నెలకు లక్ష కోట్ల అప్పులు చేస్తున్నదని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. కోటి కోట్ల అప్పులు చేసిందని, ప్రతి పౌరుడి తలపై రూ.1.24 లక్షల భారం మోపిన ఘనత బీజేపీ ప్రభుత్వానికే చెందుతుందని చెప్పారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తలాతోక లేకుండా మాట్లాడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన రుణాలపై ఆయన మాటలు హాస్యాస్పదమని ఎద్దేవాచేశారు. జగిత్యాలలో 7న కలెక్టరేట్ కార్యాలయాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించి భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్న నేపథ్యంలో మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యేలతో కలిసి ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు బీజేపీపై నిప్పులు చెరిగారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాటలు వింటే సోయి ఉండి మాట్లాడుతున్నారా? అని అనిపిస్తున్నదని పేర్కొన్నారు. జీఎస్టీ కింద తెలంగాణకు ఎనిమిదన్నర వేల కోట్లు ఇచ్చామంటున్నారని.. వాస్తవానికి ఇచ్చింది ఏమీ లేదన్నారు. తెలంగాణే జీఎస్టీ, సెస్సుల కింద కేంద్రానికి 30 వేల కోట్లు ఇచ్చిందని చెప్పారు. రాష్ట్రాలకు కేంద్రం పన్నుల వాటా పెంచిందనటం పచ్చి అబద్ధమని మండిపడ్డారు. కేంద్రం రాష్ట్రాలకు పన్నుల్లో 42 శాతం ఇస్తుందనటం సరికాదని, నికరంగా ఇచ్చేది 29.6 శాతమేనని వివరించారు. 42 శాతం లెక్కన లక్ష కోట్లు రావాల్సి ఉందని, వాటిని కిషన్‌రెడ్డి తీసుకొనిరావాలని డిమాండ్ చేశారు. ఆయనవన్నీ అబద్ధాలని, చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. రాష్ట్రాలకు పన్నుల రూపంలో నిధులు రాకుండా కేంద్రం దొడ్డిదారిన డబ్బులు మళ్లిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మాడల్ స్కూల్స్, బీఆర్‌జీఎఫ్ వంటి పథకాల రద్దుతోపాటు, సాంఘిక సంక్షేమం, గిరిజన, మహిళ సంక్షేమశాఖల్లో నిధుల్లో

-మిగతా2లో

# రూ.1.40 లక్షల కోట్లు దాటిన జీఎస్టీ వసూళ్లు

-మొదటి పేజి తరువాయి

తెలిపింది. గతేడాది నవంబరులో వసూలైన జీఎస్టీ కంటే ఇది 11 శాతం అధికం. వరుసగా 9వ నెల కూడా జీఎస్టీ వసూళ్లు రూ.1.40 లక్షల కోట్ల మార్కును దాటడం విశేషం. అయితే గత ఆగస్టు నుంచి చూస్తే ఈ నవంబరులో వసూలైన జీఎస్టీ అతి తక్కువ. అక్టోబరులో జీఎస్టీ వసూళ్లు రూ.1.52 లక్షల కోట్ల మార్కును తాకాయి. భారత జీఎస్టీ చరిత్రలో ఇదే రెండో అత్యధికం. నవంబరు మాసం జీఎస్టీ వసూళ్ల వివరాలు చూస్తే... కేంద్ర గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (సీజీఎస్టీ) రూ.25,681 కోట్లు, రాష్ట్ర గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (ఎస్జీఎస్టీ) రూ.32,651 కోట్లు, సమీకృత గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (ఐజీఎస్టీ) రూ.77,103 కోట్లు (దిగుమతులపై రూ.38,635 కోట్లతో కలిపి), సెస్ రూపేణా వసూలైన మొత్తం రూ.10,433 కోట్లు (దిగుమతులపై రూ.817 కోట్లతో కలిపి) అని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది.

# ఢిల్లీలో మూడు రోజుల పాటు లిక్కర్ బంద్

ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో మూడు రోజుల పాటు లిక్కర్ విక్రయాలు బంద్ కానున్నాయి. ఈ నెల 4న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రేపు సాయంత్రం నుంచి మందు బంద్ కానుంది. రేపు సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగియనుంది. దీంతో రేపు సాయంత్రం 5.30 గంటల నుంచి డిసెంబర్ 4వ తేదీ సాయంత్రం 5.30 గంటల వరకు వైన్ షాపులు, బార్లు, సేల్ ఔట్ లెట్స్ మూతపడనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలను జారీ చేసింది. అనధికారికంగా ఎవరూ లిక్కర్ ను నిల్వ చేయడం కానీ, తరలించడం కానీ చేయకుండా పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. మరోవైపు, డిసెంబర్ 7న కౌంటింగ్ జరగనుంది.

# జీ-20 అధ్యక్ష బాధ్యతలను చేపట్టిన భారత్

**డెస్క్:** బలమైన ఆర్థిక వ్యవస్థగా అగ్రరాజ్యాలకు దీటుగా దూసుకుపోతున్న భారత్ కు విశిష్ట ఘనత దక్కింది. ప్రపంచ దేశాల్లో బలమైన కూటమిగా పేరుపొందిన జీ-20 అధ్యక్ష బాధ్యతలను భారత్ నేడు చేపట్టింది. ఇటీవల ఇండోనేషియాలో జరిగిన జీ-20 సమావేశాల్లో ఈ బాధ్యతలను భారత్ కు బదిలీ చేశారు. డిసెంబరు 1 నుంచి జీ-20 అధ్యక్ష బాధ్యతలను భారత్ నిర్వర్తిస్తుందని ఆ సమావేశంలో ప్రకటించారు. భారత్ ఏడాది పాటు ఈ పదవిలో కొనసాగనుంది. ఈ ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా 32 ప్రాంతాల్లో వివిధ అంశాలపై 200 సమావేశాలను నిర్వహించనున్నారు. జీ-20 అధ్యక్ష బాధ్యతల నేపథ్యంలో ప్రత్యేక లోగోను రూపొందించారు. దేశంలోని 100 స్మారక చిహ్నాలపై ఈ లోగోను ప్రదర్శించనున్నారు. ఈ లోగోను త్రివర్ణ పతాకం స్ఫూర్తిగా రూపొందించారు.

# గ్రూప్ 4 నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్ :** తెలంగాణలో కొలువుల జాతర కొనసాగుతోంది. ఇప్పటికే దాదాపుగా 60 వేలకు పైగా ఉద్యోగ ఖా ళీల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల కాగా... వాటి భర్తీ వివిధ దశల్లో కొనసాగు తోంది. తాజాగా రాష్ట్రంలోని నిరుద్యోగులకు టీఆర్ఎస్ సర్కారు మరో తీపి కబురు చెప్పింది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న గ్రూప్ 4 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నోటిఫికేషన్ ద్వారా ఆయా శాఖల్లో ఖాళీగా ఉన్న 9,168 పోస్టులను భర్తీ చేయనున్నారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్పీఎస్సీ) ద్వారా జారీ అయిన ఈ నోటిఫికేషన్ కు ఈ నెల 23 నుంచి జనవరి 12 దాకా దరఖాస్తు చేసుకునేందుకు అభ్యర్థులకు అవకాశం ఉంది. ఈ నోటిఫికేషన్ పరీక్ష తేదీలను వెల్లడించని అధికారులు... పరీక్షను వచ్చే ఏడాది ఏప్రిల్ లేదంటే మే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

# కేసీఆర్ పార్టీలో ఉన్నవాళ్లంతా తాలిబన్లే.. నాకేం జరిగినా ప్రభుత్వానిదే బాధ్యత

**హైదరాబాద్ :** తెలంగాణలో తన పాదయాత్రను టీఆర్ఎస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలని చూస్తున్నాయని వైఎస్ఆర్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. ఈ క్రమంలోనే నర్సంపేటలో తనపై దాడి చేసి, తన వాహనాన్ని ధ్వంసం చేశారని చెప్పారు. ధ్వంసమైన వాహనంలో ప్రగతి భవన్ కు వెళ్తుండగా పోలీసులు తనను అరెస్ట్ చేసిన వైనం, తాను కూర్చున్న కారును టోయింగ్ చేసి పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లిన తీరుపై షర్మిల.. గురువారం రాజ్ భవన్ లో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ తెలంగాణను ఆఫ్ఘనిస్థాన్ మాదిరిగా మార్చేశారన్నారు. తాలిబన్ల మాదిరిగా పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. టీఆర్ఎస్ పార్టీలో ఉన్న వాళ్లంతా తాలిబన్లే అని ఎద్దేవా చేశారు.

కేవలం ట్రాఫిక్ జామ్ కు కారణం అయిన కేసులో తనను అరెస్టు చేశారని, మహిళను అని కూడా చూడకుండా తాను కూర్చున్న కారును టోయింగ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గంటల తరబడి తనను పోలీస్ స్టేషన్ లో విచారించడంతో పాటు తన వెంట వచ్చిన కార్యకర్తలను పోలీసులు తీవ్రంగా కొట్టారని ఆరోపించారు. 'ఈ కేసులో సీఎం కేసీఆర్ సూచన మేరకు నన్ను రిమాండ్ చేయాలని పోలీసులు అనుకున్నారు. రిమాండ్ ఎందుకు చేస్తారు? నేనేమైనా నేరం చేశానా? నా నుంచి ఏమైనా ఆధారాలు సేకరించాలా? అందుకే జడ్జీ రిమాండ్ కు అనుమతించలేదు' అని పేర్కొన్నారు. తన పాదయాత్రలో కేసీఆర్ అవినీతి గురించి, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడాన్ని ప్రస్తావిస్తున్నానని షర్మిల చెప్పారు. అందుకే టీఆర్ఎస్, కేసీఆర్ కుటుంబం తనను ఇబ్బంది పెడుతున్నాయని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ కుటుంబం వేల కోట్లను అక్రమ మార్గంలో సంపాదించారని విమర్శించారు. కేసీఆర్ కుటుంబమే దేశంలో అత్యంత ధనవంతమైన రాజకీయ కుటుంబం అన్నారు. పాదయాత్రలో తనపై, తమ నాయకులపై దాడులు చేసేందుకు టీఆర్ఎస్, ప్రభుత్వ పెద్దలు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తనకు, తమ పార్టీ నాయకులకు ఏం జరిగినా దానికి కేసీఆర్ ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు.

# రూ.1544కోట్లతో నల్లగొండ అభివృద్ధి

-మొదటి పేజి తరువాయి

ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చే బాధ్యత మా అందరిపై ఉంది. దీన్ని సమష్టి బాధ్యతగా తీసుకుంటాం. రాబోయే 10, 12 నెలల్లో సార్వత్రిక ఎన్నికలున్నయ్ కాబట్టి ఈలోగా పనులన్నీ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నం. సాధ్యమైనంత వేగంగా పనులను పూర్తి చేసి మళ్లీ ప్రజల్లోకి వెళ్తాం' అన్నారు.

**రాష్ట్రానికే విద్యుత్ వెలుగులు అందించే జిల్లాగా నల్లగొండ..**

'ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఒక్క ప్రభుత్వ మెడికల్ కాలేజీ లేదు. ఆ నాడు రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కటంటే ఇక్కటీ ఏర్పాటు చేయలేదు. కానీ, సీఎం కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక మొత్తం తెలంగాణకే దిక్సూచిగా మూడు జిల్లాలను నిలుపుతూ.. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో ఇప్పటికే మెడికల్ కాలేజీలు ప్రారంభమై బ్రహ్మాండంగా నడుస్తున్నయ్. వాటికి సంబంధించి పర్మినెంట్ బిల్డింగ్‌లు పూర్తవుతున్నయ్. మొన్న సీఎం కేసీఆర్ దామెరచర్లకు వచ్చి ఒక మాట చెప్పారు. మిర్యాలగూడ నియోజకవర్గం దామెరచర్లలో కడుతున్న అల్ట్రామెగా పవర్ ప్లాయింట్ కేవలం తెలంగాణకు కాదు.. భవిష్యత్‌లో మరొక 50, 100 సంవత్సరాల పాటు అన్ని తరాలకు వ్యవసాయం ఎంత పెరిగినా, పరిశ్రామికీకరణ, పట్టణీకరణ ఎంత పెరిగినా.. పెరుగుతున్న అవసరాలకు తగ్గ విధంగా విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. 4వేలమెగావాట్ల థర్మల్ విద్యుత్, భవిష్యత్‌లో అవసరమైతే సోలార్ పవర్ తయారు చేసే అవకాశం ఉంది. రాష్ట్రానికే విద్యుత్ వెలుగులు అందించే జిల్లాగా నల్లగొండ మారనున్నదని సీఎం కేసీఆర్ చెప్పారు. గతంలో ధాన్యభాండాగారంగా భారతదేశంలో ఆంధ్రప్రదేశ్‌కు, ముఖ్యంగా కోస్తా జిల్లాలకు పేరుండేది. కానీ ఇప్పుడు వరిధాన్యం ఎక్కువ పండిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ రెండోస్థానానికి ఎగబాకింది. దాంట్లో అత్యధికంగా వరిపం డిస్తున్న జిల్లా నల్లగొండ అని ఈ జిల్లా బిడ్డలు గర్వంగా చెప్పవచ్చు. సీఎం మద్దతు ప్రోత్సాహం వల్ల నల్లగొండ జిల్లా రైతులు అంతటి స్థాయిలో సాగు చేస్తున్నారు' అన్నారు.

**నల్లగొండ ప్రజలు గర్వంగా చెప్పొచ్చు..**

'తెలుగు రాష్ట్రాలు అబ్బురపడి చేస్తున్నాయి. ఒకనాడు ఒక పుణ్యక్షేత్రానికి రోజుకు 80వేలు, లక్ష మంది భక్తులు వస్తున్నారంటే ఆ ఖ్యాతి, కీర్తి, ప్రతిష్ట తిరుమల బాలాజీకి ఉండేది. కానీ, మా యాదాద్రికి రోజుకు రూ.కోటి ఆదాయం వస్తుంది, 80వేలపైచీలుకు భక్తులు వస్తున్నరని తెలంగాణ బిడ్డలంతా గర్వంగా చెప్పొచ్చు. దాన్ని ఆ స్థాయిలో ఘనత తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్‌ది. దండుమల్కాపురంలో తెలంగాణలోనే అతిపెద్ద పారిశ్రామిక సమూహం. 542 ఎకరాల్లో 579 యూనిట్లకు స్థలం ఇచ్చి.. వేలాది మంది పిల్లలకు ఉపాధి కల్పించే బృహత్తర ఎని కార్యక్రమం ప్రారంభించింది తెలంగాణ ప్రభుత్వం నాయకత్వంలోనే. దాన్ని త్వరలోనే సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభిస్తాం. ఈ రోజు ప్రత్యేకంగా గౌరవ మంత్రులు, పార్టీ నేతలు, సీఎం కేసీఆర్ తరఫున నల్లగొండ జిల్లాకు ఇవ్వాలనుకుంటున్న విశ్వాసం, హామీ ఏంటంటే.. మీరు తీరుగనైతే పన్నెండింటికి 12 స్థానాల్లో గెలిపించారో.. అదే పద్ధతుల్లో గుండెల్లో పెట్టుకునే బాధ్యత మాది. మాటలతోనే సరిపెట్టకుండా ఎన్నికల ఫలితం వచ్చిన నెలలోపే మళ్లీ అందరం ఇక్కడ ఉన్నం. సమీక్ష చేయడం, కార్యాచరణ చేయడంతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఏ రకమైన కార్యక్రమాలు చేపట్టాలి అనే విషయంపై రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి అధికారులు, డివిజన్, మండలస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించడం జరిగింది' అన్నారు.

**రాబోయే ఆరేడు నెలల్లో..**

రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో రాబోయే ఆరేడు నెలల్లో రూ.402కోట్లు ఖర్చు చేయబోతున్నాం. అన్ని నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారానికి అవకాశం ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, వసతులు మెరుగుపడాలని సీఎం కేసీఆర్ అన్నారు. మంత్రి దయాకర్‌రావు నేతృత్వంలో సమీక్ష నిర్వహించిన తర్వాత రాబోయే ఆరేడు నెల్లల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రూ.700కోట్లు పంచాయతీరాజ్‌శాఖ తరఫున ఖర్చు చేయబోతున్నాం. మున్సిపల్ శాఖ తరఫున 19 మున్సిపాలిటీల పరిధిలో రూ.334కోట్లు ఖర్చు చేయడంతో పాటు అదనంగా గ్రాంట్స్ ఇవ్వబోతున్నాం. గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి ఆధ్వర్యంలో వారందరి బాగు కోసం రూ.100కోట్ల తండాల్లో రోడ్ల బాగు కోసం ఖర్చు చేయనున్నాం. జిల్లా ముద్దుబిడ్డ, విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా రైతాంగానికి 24గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రాబోయే ఆరేడు నెలల్లో ఆర్‌అండ్‌బీ, పీఆర్, మున్సిపల్, గిరిజన సంక్షేమశాఖల ఆధ్వర్యంలో రూ.1544కోట్లు 12 నియోజకవర్గాల్లో ఖర్చు చేయబోతున్నం. నల్లగొండ బిడ్డల రుణం తీర్చుకునే ప్రయత్నం చేస్తున్నానని విజ్ఞప్తి చేస్తున్నం' అని పేర్కొన్నారు.

# బీజేపీ పాలనలో అప్పుల భారతం

-మొదటి పేజి తరువాయి

కోత విధిస్తున్నదని చెప్పారు. దీంతో ఆ పథకాల నిర్వహణ భారం రాష్ట్ర ప్రభుత్వాలపై పడి ఆర్థిక ఇబ్బందులు వస్తున్నాయని చెప్పారు.

**ఎన్నికలున్న రాష్ట్రాల్లో ఈడీ, ఐటీ తనిఖీలు**

బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు బీజేపీ పాల్పడుతున్నదని, ఎన్నికలు వచ్చే రాష్ట్రాల్లో ఈడీ, ఐటీ తనిఖీలు చేయిస్తున్నదని మంత్రి హరీశ్‌రావు దుయ్యబట్టారు. బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా టీఆర్ఎస్ తలవంచదని, గట్టిగా పోరాడుతుందని స్పష్టంచేశారు. బీజేపీ పెట్టించే పార్టీలు, వదిలే బాణాలు, కుట్రలు..ఉద్యమాల గడ్డపై నడువబోవని తేల్చిచెప్పారు. బీజేపీది అధికార యావ అయితే, టీఆర్ఎస్‌ది ప్రజల తోవ అని పేర్కొన్నారు. బీజేపీ నాయకుల యాత్రలు చూస్తుంటే.. టీఆర్ఎస్ పార్టీ మీటింగ్‌లో స్థలం దొరక్క తిరిగి వెళ్లేంత మంది కూడా ఉండటం లేదని, వారి పాదయాత్రలు వెలవెలబోతున్నాయని ఎద్దేవాచేశారు. కేంద్రం ఎంఎంఆర్(మాతృ మరణాల నిష్పత్తి) తగ్గుదల లెకలను విడుదల చేస్తే, అందులో డబుల్ ఇంజిన్ ఉత్తరప్రదేశ్ చివరిస్థానంలో ఉన్నదని, తెలంగాణ దేశంలోనే మూడో స్థానంలో నిలిచిందని గుర్తుచేశారు. బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా 157 మెడికల్ కాలేజీలు మంజూరుచేసినా, తెలంగాణకు ఒక్కటీ ఇవ్వకుండా వివక్ష ప్రదర్శించిందని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ 33 జిల్లాల్లో 33 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తున్నారని, ఇప్పటికే 17 ప్రారంభమయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్‌కుమార్, ఆశన్నగారి జీవన్‌రెడ్డి, సుంకె రవిశంకర్, చెన్నమనేని రమేశ్‌బాబు, దాసరి మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు భానుప్రసాద్‌రావు, ఎల్ రమణ, పాడి కౌశిక్‌రెడ్డి, జగిత్యాల జెడ్పీ చైర్‌పర్సన్ వసంత, మున్సిపల్ చైర్‌పర్సన్లు శ్రావణి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని 5 లక్షల కోట్ల అప్పుల్లో ముంచిండు

-మొదటి పేజి తరువాయి

పేర్కొన్నారు. ప్రజా సంగ్రామ యాత్రలో భాగంగా నిర్మల్ లో గురువారం మాట్లాడిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బెంగళూరులో టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డ్రగ్స్ దందా చేస్తున్నారని బండి సంజయ్ అన్నారు. ఈ క్రమంలో బెంగళూరు డ్రగ్స్ కేసులో టీఆర్ఎస్ కు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేల పాత్ర ఉందని బెంగళూరు పోలీసులు నిర్ధారించారన్నారు. ఈ విషయం తెలుసుకున్న టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బెంగళూరు పోలీసులకు డబ్బులిచ్చి మరీ కేసును కొట్టివేయించుకున్నారన్నారు. కర్ణాటకలో తమ పార్టీ ప్రభుత్వం ఉన్నా కూడా టీఆర్ఎస్ నేతలు ఈ కేసులో తమ పేర్లను కొట్టివేయించుకున్నారని ఆయన చెప్పారు.

**ప్రజాసంగ్రామ యాత్రను చూసి టీఆర్ఎస్ భయపడుతోంది..**

బీజేపీ పాదయాత్రకు జనం వస్తలేరని టీఆర్ఎస్ తప్పుడు ప్రచారానికి తెర లేపిందని తెలంగాణ బీజేపీ చీఫ్ బండి సంజయ్ మండిపడ్డారు. ప్రజాసంగ్రామ యాత్రకు జనం రానప్పుడు.. భైంసా సభను ఎందుకు అడ్డుకున్నరని ప్రశ్నించారు. ప్రజాసంగ్రామ యాత్రను చూసి టీఆర్ఎస్ భయపడుతోందన్నారు. నిర్మల్ జిల్లా కుంటాల బస్టాండ్ దగ్గర బహిరంగ సభలో బండి సంజయ్ మాట్లాడారు. కేసీఆర్ సభలు, కార్యక్రమాలకు జనం పోవట్లేదని.. పైసలిచ్చి చప్పట్లు కొట్టించుకునే పరిస్థితి ఉందన్నారు. "కేసీఆర్ కుటుంబ సభ్యులు వందలు, వేల కోట్ల అక్రమాస్తులు కూడబెట్టి విదేశాల్లో పెట్టుబడులు పెడుతున్నరు.. లిక్కర్ దందాలో పెట్టుబడులు పెడుతున్నరు. ఇదే సమయంలో రాష్ట్రం మాత్రం 5 లక్షల కోట్ల అప్పుల్లో మునిగిపోయింది. కేసీఆర్ హయాంలో రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి పేరు మీద లక్ష రూపాయల అప్పు అయింది. ఒక్కసారి రాష్ట్రం పరిస్థితిని అర్థం చేసుకోండి"అని సంజయ్ వ్యాఖ్యానించారు. ధరణి పోర్టల్ లో ఎవరి జాగ ఎవరి పేరు మీద ఉందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు.

# బీఆర్ఎస్ ఏర్పాటు బీజేపీని ఉలిక్కిపడేలా చేసింది

-మొదటి పేజి తరువాయి

తమను ఎవరూ ఆపలేరని అన్నారు. ఈ మేరకు ఆమె ట్వీట్ చేశారు. ఈ ఉదయం తన ఇంటి వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్న జనాలకు సంబంధించిన వీడియోను షేర్ చేశారు. తన నివాసంలో టీఆర్ఎస్ నేతలతో చర్చలు జరిపిన అనంతరం వారితో కలిసి బయటకు వస్తున్న దృశ్యాలు ఆ వీడియోలో ఉన్నాయి.

# కేసీఆర్ మోడీకి జై కొడితే..రాత్రికిరాత్రే కేసులన్నీ మాయం: నారాయణ



తెలంగాణలో టీఆర్ఎస్ వ్యతిరేకిస్తోంది కాబట్టే ఆ పార్టీపై కేంద్రం దాడులు చేయిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకించే రాష్ట్ర ప్రభుత్వాలు, పార్టీలు, వ్యక్తులపై కేంద్రం ఏకపక్ష దాడులు జరుపుతోందన్నారు. ఒకవేళ కేసీఆర్ మోడీకి జై కొడితే.. రాత్రికి రాత్రే కేసులన్నీ మాయమైపోతాయని అన్నారు. తృణమూల్ కాంగ్రెస్‌లో శారద, నారద కేసుల్లో ఉన్నవాళ్లు బీజేపీలో చేరగానే ఏమైందో తెలుసు కదా అని అన్నారు. జీ-20కి భారత నాయకత్వాన్ని సీపీఐ కూడా స్వాగతిస్తుందని నారాయణ అన్నారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే మహిళా సాధికారత బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు. మహిళా సాధికారత బిల్లును ఆమోదించకుండా జీ-20లో మహిళా సాధికారతపై ఏం చర్చిస్తారని ప్రశ్నించారు. మహిళా సాధికారిత బిల్లు ఆమోదానికి సీపీఐ పూర్తిగా సహకరిస్తుందని చెప్పారు. జీ-20లో పుష్పం గుర్తును లోగోగా పెట్టారని.. ఇది సంకుచిత స్వభావానికి నిదర్శనమని..దీనిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఏపీలో వైసీపీ గెలిచిందంటే బీజేపీ గెలిచినట్టేనని నారాయణ అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల కంటే ఎక్కువ వైసీపీ నుంచి ఎక్కువ మద్ధతు లభిస్తోందన్నారు. టీడీపీని బలహీనపర్చడం కోసం పవన్ కళ్యాణ్‌ను బీజేపీ తమవైపు లాగుతోందన్నారు. మోడీకి మద్ధతిచ్చే వైసీపీకి వ్యతిరేకంగా అందరూ కలవాల్సిన అవసరం ఉందన్నారు. పవన్ కళ్యాణ్ ఎంతవరకు కలిసొస్తారో చూడాలని అన్నారు.

# టీచర్ పోస్టులను భర్తీ చేయకపోతే నేతలు బయట తిరగలేరు



తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 45వేల ఉపాధ్యాయ పోస్టులు, కేంద్రం లో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ అన్ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ నీలా వెంకటేష్ ఆధ్వర్యంలో దిల్ సుఖ్ నగర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఆయన.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరారు. పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోతే విద్యార్థులకు ఎవరు పాఠాలు చెప్తారని ఆర్ కృష్ణయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్య ఇప్పటికే నిర్వీర్యమైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. టీచర్ పోస్టులను భర్తీ చేయకపోతే ఎమ్మెల్యేలు, మంత్రులు బయట తిరగలేరని ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. ఇదిలా ఉండగా ఈ కార్యక్రమంలో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, గుజ్జు కృష్ణ, ఇతర బీసీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ సుందరి ఎస్మా వోలోడర్ కైట్స్

# పిల్లల అభివృద్ధి కేంద్రాన్ని సందర్శించారు...

(ఏఎస్ రావు నగర్/శుభ తెలంగాణ) మిషన్ టు ఇండియాలో భాగంగా డాక్టర్ సతీష్ సిఖాతో కలిసి 90 మిలియన్ స్మైల్‌లను కైట్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌గా సందర్శించారు. మిస్ వరల్డ్ కాకుండా సైకాలజిస్ట్‌గా ఉన్న ఎస్మా వోలోడర్ పిల్లలను అభివృద్ధితో తీసుకెళ్లే పరంగా ఇన్‌పుట్ ఇచ్చింది, ఆలస్యమైన పిల్లలను గాలిపటాలతో ముందుకు తీసుకెళ్లే విషయంలో అవగాహన కల్పించడంలో ఆమె అభిరుచిని కలిగి ఉంది.కైట్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ 90 మిలియన్ సిమైల్స్‌ఎస్మా వోలోడర్‌తో పాటు పిల్లలను ఆలస్యం చేయకుండా అవగాహన కల్పించేందుకు అంబాసిడర్‌గా ఉన్నారు.



## పొన్నుస్వామి గారు బయో రసాయన ఎరువులు ఇవ్వండి మహాప్రభో....

గత 4 రోజుల నుండి మేడ్చల్-మల్కాజ్ గిరి జిల్లా కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని దూలపల్లి పారిశ్రామిక వాడాలో ఉన్న పొన్ను స్వామి బయో రసాయన కేంద్రం పై పలు వార్త కథనాలు రావడం తో ఉన్నత అధికారులు రసాయనాలను అమ్మవద్దని వాటికి సంబంధించిన నమూనాలను సేకరించి తీసుకెళ్లడం జరిగిందని అప్పటి నుండి రసాయనాలను రైతులకు ఇవ్వకుండా ఉన్నారని రైతులు వాపోతున్నారు.రైతులు మాట్లాడుతూ గత 3 సంవత్సరాల నుండి ఇక్కడి నుండే బయో రసాయనాలను తీసుకెళ్తున్నామని చాల మంచి దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు.తాము కకర్నూల్ నుండి వచ్చామని ఇక్కడికి రాగానే ఈ చేదు వార్త అందిందని తాము మనోవేధనతో ఉన్నామని తమ ఊరిలో వేసిన పత్తి మరియు మిర్చి పంటలకు ఎక్కడినుండి రసాయనాలను తీసుకెళ్లి పంటలకు వేశామని అవ్వి ఇప్పుడు నెలకు ఒరుగుతున్నాయని తమకు ఇంకా ఆఏమి దిక్కుతోచని స్థితిలో ఉన్నామని ఈ సారి పిచికారి చేయకుంటే పంట నష్టం లక్షల్లో ఉంటుందని దానికి బాధ్యత ఎవరు తీసుకుంటారని రైతులు కేంద్రం వద్ద తమ గోడును విలపిస్తున్నారు.మరో 10 రోజుల వరకు అమ్మకం జరగదని తెలిపిన యాజమాన్యానికి వారు హెచ్చరించారు.తాము ఈ రసాయనాలను వాడటం వల్లనా ఎలాంటి నష్టం జరగడం లేదని తాము 500 కిలోమీటర్ల దూరం నుండి వచ్చి రసాయనాలను స్వీకరిస్తున్నామని మాకు లేని బాధ ఈ అధికారులకు అందుకని మండిపడ్డారు.ఇలానే రైతుల నడ్డివిసిరే ప్రభుత్వాలు ఉంటే తాము రాస్తారోకోలు చేస్తామని అధికారులకు హెచ్చరించారు.రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది అనే సూత్రానికి అక్కడ న్యాయం జరుగుతుందని రైతు ఏడ్చినా రాజ్యం బాగుపడ్డట్టు ఎక్కడ లేదని రైతులు కన్నీరుపెట్టుకుంటున్నారు.ఈ రసాయనాలు ఇవ్వకుంటే చాల నష్టపోతామని రైతులక పట్ల మొండివైఖరి సరికాదని రైతులు తెలిపారు.ఈ కేంద్రం యజమాని పొన్ను స్వామి తమకు రసాయనాలు అమ్మాలని దీనితో పాటు అధికారుల నుండి తగిన సమాచారాన్ని తెలుసుకుంటూ రైతులకు న్యాయం చేయాలని రైతులు పొనుస్వామిని వేడుకుంటున్నారు.

## వికలాంగుల వృద్ధుల వితంతుల ఒంటరి మహిళ పెన్షన్ వెంటనే పెంచాలి

- వికలాంగుల హక్కుల పోరాట సమితి VHPS
- MRPS. MSP .ఆధ్వర్యంలో
- వికలాంగుల వృద్ధుల వితంతుల ఒంటరి మహిళలకు ఇస్తున్న పెన్షన్??2016.3016 నుండి 6000 వరకు పెంచాలని డిమాండ్ .
- వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నెంబర్ 17న సవరణ చేయాలని వికలాంగులకు 4% శాతం రిజర్వేషన్లు కల్పించాలని వికలాంగులకు పంచాయతీ నుండి పార్లమెంట్ వరకు ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని. వికలాంగుల అభివృద్ధి కోసం వికలాంగుల బంధును ఏర్పాటు చేయాలని. ఈరోజు వికలాంగుల హక్కుల పోరాట సమితి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మరియు మహాజన సోషలిస్టు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు గౌరవ శ్రీ మందకృష్ణ మాదిగ గారి పిలుపుమేరకు. ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి కలెక్టరేట్ ముందు మహాధర్న కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ రాష్ట్ర జిల్లా మండల స్థాయి నాయకులు. మరియు ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని మాదిగ హక్కుల పోరాట సమితి మహాజన సోషలిస్ట్ పార్టీ మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ రాష్ట్ర జిల్లా మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో టియుడబ్ల్యూజే (హెచ్-143) ముందుంది

- సూర్యాపేట జిల్లా అధ్యక్షులు వజ్జే వీరయ్య యాదవ్



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తుంగతుర్తి జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో టియుడబ్ల్యూజే (హెచ్-143) ముందుంటుందని సంఘ జిల్లా అధ్యక్షులు వజ్జే వీరయ్య యాదవ్ అన్నారు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లాలోని తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఆయన సభ్యత్వాలను అందజేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ రాష్ట్ర%శీ%లో పని చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమం కోసం తీవ్రంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు అందుకు సంఘాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ప్రతి జర్నలిస్టుపై ఉందని చెప్పారు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అక్రిడేషన్ కమిటీ సభ్యులు పెద్దింటి శ్యాంసుందర్ రెడ్డి సంఘ నాయకులు చల్లా చంద్రశేఖర్ షబ్బీర్ ఊటుకూరి రవీందర్ ఓరుగంటి శ్రీనివాస్ నజీర్ సూర్య ప్రకాష్ బాబా సత్యనారాయణ సుభాష్ మాజిద్ యల్లయ్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యం వల్లనే కుమ్మరి కుంటలో డ్రైనేజీ నీరు

- కార్పొరేటర్ కల్లెం నవజీవన్ రెడ్డి



ఎల్బీనగర్ :హయత్ నగర్ డివిజన్ పరిధిలోని కుమ్మరి కుంటలో డ్రైనేజీ నీరు కలుషితమై రెండు రోజులుగా నీటి కాలుష్యం ఏర్పడిందని అధికారులకు తెలిపిన ఎలాంటి చర్యలు తీసుకోపోవడంతో స్థానిక కార్పొరేటర్ అగ్రహం వ్యక్తం చేశారు. కాలనీవాసుల సమాచారం మేరకు కుమ్మరికుంటకు అనుకొని ఉన్న పద్మావతి కాలనీలో గురువారం రోజున పర్యటించి కుమ్మరి కుంటలో డ్రైనేజీ నీరు కలవడంతో పరిసర ప్రాంతాలలో ఉన్న కాలనీలకు బోర్ వాటర్ లో మురుగునీరు రావడంతో కాలనీవాసులు చాలా అవస్థలు పడుతున్నారని తెలిపారు. కేవలం అధికారుల నిర్లక్ష్యం వల్లనే కుమ్మరి కుంటలో మురుగునీరు చేరుతుందని అన్నారు. అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు చెరువుల ఆధునికరణ చెయ్యకపోగా కనీసం కుమ్మరి కుంటలో మురుగునీరు చేరకుండా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పద్మావతి కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, భాజపా నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదిపై దాడిని ఖండిస్తూ నిరసన తెలిపిన వరంగల్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు:-



వరంగల్ : నిన్న సిటీ సివిల్ కోర్టులో న్యాయవాది సయ్యద్ యాకుబ్ జైర్ పై దాడిని ఖండిస్తూ ఈ రోజు వరంగల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈ. ఆనంద్ మోహన్ మాట్లాడుతూ న్యాయవాదుల ప్రొటెక్షన్ యాక్ట్ ను ప్రభుత్వం వెంటనే తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . తద్వారా న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరుతూ కోర్టు ముందు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ మెంబర్ దుస్సా జనార్ధన్ మరియు వరంగల్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఈ. ఆనంద్ మోహన్, జనరల్ సెక్రటరీ జి. శ్రీనివాస్ గౌడ్, లేడీ జాయింట్ సెక్రెటరీ ఆర్. శశిరేఖ, ట్రేజరర్ టి. సుభాష్, ఈసీ మెంబర్లు జి.అన్నపూర్ణ, కె. శ్రీలత, డి. అచ్యుత్ కుమార్, పి.కార్తిక్, వి. రామకృష్ణ మరియు సీనియర్ జూనియర్ %డ% మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఎల్బీనగర్ దిల్ సుఖ్ నగర్ పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు

- సికింద్రాబాద్ పార్లమెంట్ టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ సాయికిరణ్ యాదవ్ స్వామి



ఎల్బీనగర్ : సికింద్రాబాద్ పార్లమెంట్ తెరాస పార్టీ ఇన్చార్జ్ సాయికిరణ్ యాదవ్ స్వామి గురువారం రోజున ఎల్బీనగర్, దిల్ సుఖ్ నగర్ పరిధిలోని పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.దిల్ సుఖ్ నగర్ లోని కనకదుర్గమ్మ వారిని దర్శించుకొని ఏక పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. తదనంతరం సాయిబాబా దేవాలయంలో బాబాని దర్శించుకున్నారు. సాయిబాబా ఆలయంలో అన్నదాన కార్యక్రమం కొరకు 51 వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ మాజీ కార్పొరేటర్ జిన్నారం విట్టల్ రెడ్డి, గడ్డిఅన్నారం తెరాస యువ నాయకులు సన్నీ యాదవ్, సాయిబాబా ఆలయ ట్రస్ట్ సభ్యులు ఊర నరసింహగుప్త, శ్రీనివాస్ యాదవ్, తెరాస సీనియర్ నాయకులు పవన్, గట్టు శ్రీనివాస్, రమణారెడ్డి, విజయ, రంగా, పోచిరెడ్డి, తిరుమలరెడ్డి, వీరన్న యాదవ్, ప్రభాకర్ రావు, వెంకట్ రెడ్డి, అంజయ్య, పూర్ణచంద్రరావు, కోటి, రాము, అంజి, కుమార్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## నర్సరీ పెంపకం పై అవగాహన.



జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడునూతల గ్రామం నర్సరీలో గ్రామపంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ అయిన సందెల వెంకన్న ఆధ్వర్యంలో ఎంపీడీవో సురేంద్రనాయక్ మాట్లాడుతూ గ్రామపంచాయతీల కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు, టెక్నికల్ అసిస్టెంట్లకు, నర్సరీ వాచర్లకు, నర్సరీ బ్యాగ్ ఫిల్లింగ్ పైన ఏవిధంగా ఫిల్లింగ్ చేయాలి మట్టి ఎలా పట్టాలి అందులో కలపాల్సిన ఎరువులు ఏ విధంగా కలపాలి బ్యాగులో స్టంప్స్ సీడు ఎట్లా చేయాలి ప్రైమర్ బెడ్లు ఎట్లా ఏర్పాటు చేయాలి విషయంపై అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో యంపి.డీ.వో సురేంద్రనాయక్, ఏ.పీ.వో కుమారస్వామి, టెక్నికల్ అసిస్టెంట్లు భాస్కర్, యాకయ్య, సుధీర్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## టీఆర్ఎస్ బలోపేతమే లక్ష్యం



- ప్రారంభమైన పల్లెపల్లెకు టీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాలు
- ఇంటింటికీ సంక్షేమ పథకాలు వివరించాలని పార్టీ నేతలకు సూచన

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని అన్ని మండలాలు అన్ని గ్రామాల్లో టీఆర్ఎస్‌ను బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యమని ఎంపీపీ పి. కృపేష్ పార్టీ మండల అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు అన్నారు. మండలంలోని ఎలిమినేడు గ్రామంలో ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో టీఆర్ఎస్ గ్రామశాఖ సమావేశాలను విజయవంతం చేయాలన్నారు. డిసెంబర్ 2లోగా సమావేశాలను పూర్తి చేసి, 50మంది ముఖ్య కార్యకర్తలను ఎంపిక చేయాలన్నారు. మండలంలోని గ్రామాలను జోన్లుగా విభజించి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సూచన మేరకు జోన్ వారీగా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మంచిరెడ్డి ప్రతాప్ రెడ్డి , సహకార సంఘం చైర్మన్ మహేందర్ రెడ్డి , గ్రామ శాఖ అధ్యక్షుడు నర్సింహ , సీనియర్ నాయకులు, యూవజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీస్ కిష్టయ్య వర్ధంతిని అధికారికంగా ప్రభుత్వమే నిర్వహించాలి



మలిదశ తెలంగాణ ఉద్యమ పోరుడు తొలి అమరుడు కీర్తిశేషులు పోలీస్ కిష్టయ్య ముదిరాజు సంస్మరణ దినం సందర్భంగా తెలంగాణ ముదిరాజ్ మహాసభ అర్బన్ ప్రధాన కార్యదర్శి పులి రజనీకాంత్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ అధ్యక్షులు భయ్యా స్వామి పాల్గొన్నారు ఇరువురు మాట్లాడుతూ తెలంగాణ తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య ముదిరాజు పోలీస్ డ్యూటీ లో ఉండి డిసెంబర్ ఒకటవ తారీఖున రివాల్ వారితో కాల్చుకొని చనిపోయాడు అమరుడైన కిష్టయ్య ముదిరాజు తొలి అమరుడు గా ప్రభుత్వ గుర్తించాలని డిమాండ్ చేశారు వర్ధంతిని అధికారికంగా ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు ప్రతి జిల్లాలో కిష్టయ్య గారి విగ్రహం ప్రభుత్వం ఏర్పాటు చేయాలని హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై విగ్రహం పెట్టాలని డిమాండ్ చేశారు రాష్ట్ర పోలీస్ డిపార్ట్మెంట్ కిష్టయ్య ముదిరాజ్ పేరిట స్మారక అవార్డు నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అర్బన్ ముదిరాజ్ నాయకులు కేశవైన శ్రవణ్ చుంచు కృష్ణ పిట్టల సత్యనారాయణ అశోక్ రామ్ రాజ్ నవీన్ విక్రం రమేష్ ప్రభాకర్ రాజు రఘురాం నర్సింగ్ శంకర్ సందీప్ కోరబోయిన రవి సతీష్ రమేష్ ఎల్లేష్ శ్రీధర్ రవీందర్ మరియు ముదిరాజ్ బంధువులందరూ పెద్ద ఎత్తున పాల్గొని కృష్ణయ్య ముదిరాజ్ గారికి నివాళులర్పిం చారు.

## కురుమ సంఘం నియోజకవర్గ యువత అధ్యక్షుడిగా ఇందూరి మోహన్



ఆందోల్ నియోజకవర్గ కురుమ యువత అధ్యక్షుడిగా ముదిమణిక్యం గ్రామానికి చెందిన ఇందూరి మోహన్ ను బస్వపూర్ శివారులో ఫంక్షన్ హాల్ లో జరిగిన నూతన కురుమ సంఘం ఎన్నిక సమావేశంలో సంగారెడ్డి జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు బురుగడ్డ పుష్ప నగేష్ గారు ప్రకటించడం ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ కురుమాల హక్కుల కోసం అదేవిధంగా కురుమ యూత్ చైతన్యం కోసం పాటుపడుతాను అని పేర్కొన్నారు

# యూత్ కాంగ్రెస్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక



**ఇబ్రహీంపట్నం** :యాచారం మండలం చింతపట్ల గ్రామంలో గురువారం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరారం వెంకటరెడ్డి ఆద్వర్యంలో యూత్ కాంగ్రెస్ కమిటీని ఎన్నుకోవడం జరిగింది.అధ్యక్షుడు దెంది నర్సిరెడ్డి,వైస్ ప్రెసిడెంట్ గా ప్రవీణ్ ,నగేష్, ప్రదాన కార్యదర్శి. షబ్బీర్,బి వెంకటేష్ గా ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమానికి కిసాన్ కాంగ్రెస్ యాచారం మండల అధ్యక్షుడు లిక్కి పాండు రంగారెడ్డి, ఇబ్రహీంపట్నం లీగల్ సెల్ వెంకటేష్ యాదవ్ , చీర శేఖర్,మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పాశం జయప్రకాష్,మదు యాచారం మండలం మైనారిటీ అధ్యక్షులు ఇబ్రహీం, నడ్డి విజయ్, విక్రమ్,ఫాజిల్ అఖిల్,కిషన్, చింతపట్ల మెహేందర్ గౌడ్ ,షకీల్, రాజు, యాదయ్య, రాములు,వంశీ చరణ్ తుడితరులు పాల్గోన్నారు.

# ఘనంగా పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ వర్ధంతి వేడుకలు

- అబ్దుల్లాపూర్ మెట్ మండల ముదిరాజ్ కమిటీ



**ఎల్బీనగర్** : రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిధిలో పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక తెలంగాణ కోసం ఉద్యమ సమయంలో తన ప్రాణాలు కూడా లెక్కచేయకుండా ఉద్యోగాన్ని కూడా లెక్కచేయకుండా ప్రాణాలు అర్పించి అమరుడైన మలిదశ తెలంగాణ ఉద్యమానికి నాంది పలికిన ఉద్యమ వీరుడు ముద్దు పోలీస్ కృష్ణయ్య ముదిరాజ్ వర్ధంతి సందర్భంగా అబ్దుల్లాపూర్ మెట్ మండల ముదిరాజ్ కమిటీ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంత గొప్ప వ్యక్తి యొక్క వర్ధంతిని డిసెంబర్ 1న ప్రభుత్వం అధికారికంగా జరిపించాలని, ట్యాంక్ బండ్ పై ఆయన విగ్రహం స్థాపించాలని వారు ప్రభుత్వాన్ని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో అనాజ్ పూర్ గ్రామ సర్పంచ్ కావలి రంగయ్య ముదిరాజ్, జోర్క శ్రీరాములు ముదిరాజ్, మండల ముదిరాజ్ అధ్యక్షుడు కావలి శ్రీశైలం ముదిరాజ్, డైరెక్టర్స్ మాదరమోని యాదగిరి ముదిరాజ్, ఎడ్ల మహేందర్ ముదిరాజ్, జంగయ్య ముదిరాజ్, నరేష్ ముదిరాజ్,భరత్ ముదిరాజ్, రూపేష్ ముదిరాజ్,కృష్ణ ముదిరాజ్, ప్రభాకర్ ముదిరాజ్, పరమేష్ ముదిరాజ్, మల్లేష్ ముదిరాజ్,అంకుష్ ముదిరాజ్,బిక్షపతి ముదిరాజ్,శివరామకృష్ణ ముదిరాజ్,జింక నరేష్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి జిల్లా కలెక్టర్ శశాంక..



డోర్నకల్ నియోజకవర్గం లో చేపడుతున్న రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశించారు.గురువారం కలెక్టర్ కార్యాలయంలో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాల ప్రగతి పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1800 నిర్మాణాలు చేపట్టగా వాటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

పూర్తయిన చిలంచర్ల ఉయ్యాలవాడ మొగిలిచర్ల ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని అదనపు కలెక్టర్ కు సూచించారు.వివిధ దశల్లో ఉన్న ఇళ్లను జనవరి మాసంతానికి పూర్తి చేయాలన్నారు.ఈ సమీక్ష సమావేశంలో ఇంజనీరింగ్ అధికారులు అరుణ్ కుమార్ సదానందం కలెక్టర్ కార్యాలయం ఏవో వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ కిష్టయ్య13 వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించిన సూరారం ముదిరాజ్ సంఘం నాయకులు



**కుత్బుల్లాపూర్** :మలిదశ తెలంగాణ ఉద్యమ పోరుడు తొలి అమరుడు కీర్తిశేషులు పోలీస్ కిష్టయ్య ముదిరాజు సంస్మరణ దినం సందర్భంగా సూరారం ముదిరాజ్ సంఘం నాయకులుకోల రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు ఈ కార్యక్రమానికి రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య ముదిరాజు పోలీస్ డ్యూటీ లో ఉండి డిసెంబర్ ఒకటవ తారీఖున రివాల్ వార్ తో కాల్చుకొని చనిపోయాడు అమరుడైన కిష్టయ్య ముదిరాజు తొలి అమరుడు గా ప్రభుత్వ గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజల. రాజు, వినోద్, ఎమ్. గణేష్ , పి.వెంకటేష్ ,సిహెచ్. శ్రీనివాస్, సీతయ్య ,అనిల్, ఎమ్. రాజు, విగ్నేష్, యాదగిరి పాల్గొని కృష్ణయ్య ముదిరాజ్ కి నివాళులర్పిం చారు.

# నిజాం అరాచక పాలన గురించి నేటి యువత తెలుసుకోవాలి.





- యువ సమ్మేళనంలో
- ఆర్.ఎస్.ఎస్ రాష్ట ప్రధాన కార్యదర్శి కాచం రమేశ్.

**వరంగల్** :రెండు దశాబ్దాల పాటు నైజాం సంస్థానంలో కొనసాగిన నిజాముల అరాచక పాలనను నేటి యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్రీయ స్వయంసేవక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాచం రమేష్ అన్నారు.

నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాలను పురస్కరించుకొని ఉత్సవ సమితి గురువారం హంటర్ రోడ్ లోని విష్ణుప్రియ గార్డెన్ లో నిర్వహించిన యువ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉత్సవ సమితి అధ్యక్షులు ఆచార్య జి . దామోదర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి కాచం రమేష్ మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానం అభివృద్ధి నిజాం వల్ల జరగలేదని, కాకతీయుల సామ్రాజ్యం మొదలుకొని ఆ తర్వాత పరిపాలించిన రాజుల కాలంలోనే తెలంగాణ ప్రాంతం అనేక రంగాలలో అభివృద్ధి చెందిందని ఆయన అన్నారు. హైదరాబాద్ సంస్థానంలోని భూమి నిజాం జాగిర్దార్లది కాదని, ఈ భూమి భారతీయులదన్న విషయం ప్రతి ఒక్క భారతీయుడు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నైజాం ప్రాంతాన్ని ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ గద్దెనెక్కాక అప్పటివరకు ప్రధానమంత్రిగా ఉన్న కిషన్ ప్రసాదును తొలగించి ఆయన స్థానంలో లాయక్ అలీ అనే ముస్లింను ప్రధానిగా చేసి ఇక్కడి మెజారిటీ ప్రజల ధర్మాన్ని, సంస్కృతిని, సాహిత్యాన్ని, భాషను దెబ్బతీసేలా ప్రవర్తించాడన్నారు .నిజాం సంస్థానంలో తెలుగు భాషను నిషేధించి ఉర్దూను అధికారిక భాషగా ప్రవేశపెట్టి తెలుగు, కన్నడ, మరాఠీ భాషలను పూర్తిగా రద్దు చేశాడన్నారు .దీంతో విద్య, ఉపాధి రంగాలలో హిందువులకు స్థానం లేకుండా పోయిందన్నారు.మన తాతలు, ముత్తాతలు అందరూ కూడా ఉర్దూ మీడియం లో చదువుకోవాల్సిన పరిస్థితి ఆనాడు ఏర్పడిందన్నారు. నిజాం సంస్థానంలో ఆరోజు పదివేల గ్రామాలలో 85వేల చదరపు కిలోమీటర్ల భూభాగం ఉంటే నిజాం, అతని కుటుంబ సభ్యుల ఆధీనంలో 4500 చదరపు కిలోమీటర్ల భూభాగం ఉండేదని, దానిపై పన్ను రూపేనా వచ్చే నిజాం కుటుంబం అనుభవించేదన్నారు. ప్రపంచంలో కెల్లా అత్యంత ధనవంతుడిగా నిజాం కు ఆరోజు పేరు ప్రఖ్యాతులు ఉన్నాయని, అయితే ఆ డబ్బులన్నీ కూడా ఆనాడు మెజారిటీ హిందూ ప్రజలను పీడించి పన్నుల రూపంలో దోచుకున్న డబ్బులే ఆయనను ధనవంతుడిగా మార్చాయని ఆయన అన్నారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చి నా, నైజాం సంస్థానాన్ని భారతీయూనియన్లో పరిస్థితుల్లో విలీనం చేయనని మొండికేసి ఉస్మానిస్తాన్ గా మారుస్తాను లేదా పాకిస్తాన్ లో నైనా కలుపుతానని నిజాం బీరాలు పలికాడని ఆయన విమర్శించారు. నిజాం తన పరిపాలనను కొనసాగించడానికి కాసిం రజ్వి నేతృత్వంలోని రజాకార్ల ను గ్రామాల మీదికి పంపి అరాచకాలు సృష్టించాడని ఆయన తెలిపారు. ఆనాడు రజాకారులు గ్రామాల మీద పడి గ్రామస్తులను చితకబాది బంగారం ,వారి ఆస్తులు, చివరికి మేకలు, కోడి పిల్లలు సైతం ఎత్తుక వెళ్లేవారు అన్నారు .రజాకారుల ముందు ఆనాటి ప్రజలు చెప్పులు వేసుకొని నడుస్తుంటే వాళ్ళ కాలు నరికి వేసిన సంఘటనలు అనేక గ్రామాలలో జరగాయన్నారు. గ్రామాల మీద పడి స్త్రీల మీద సామూహిక అత్యాచారాలు చేస్తూ కనబడిన వారినల్లా నరికి చంపి వేసినటువంటి దుర్మార్గపు పరిపాలన నిజాం కాలంలో కొనసాగింది అన్నారు. రాచకొండ ప్రాంతంలో చివరికి స్త్రీల బరువుల మీద కూడా పన్ను వేసిన దుర్మార్గుడు నిజాం అని ఆయన విమర్శించారు.

రజాకార్ల నాయకుడు ఖాసిం రజ్వీ తమ్ముడు తయ్యబ్ రజ్వి బీబీనగర్ కేంద్రంగా తెలంగాణలో పలు గ్రామాల మీద పడి దోపిడీలు చేస్తూ దుర్మార్గమైనటువంటి నిజాం పరిపాలనకు సహకారం అందజేశారన్నారు. మహారాష్ట్రలోని వాడి రైల్వే స్టేషన్ సమీపంలో బతుకమ్మ ఆడి రైల్లో వస్తున్నటువంటి మహిళలను రైలు దింపి గానుగాపూర్ పోలీస్ స్టేషన్కు తీసుకెళ్లి ఆ మహిళలందరినీ నగ్నంగా చేసి బతుకమ్మ ఆడించినటువంటి సంఘటనలు అనేకం తెలంగాణలో జరిగాయన్నారు. త్రివర్ణ పతాకం పట్టుకుంటే వారిని నరికి చంపి వేసినటువంటి దుర్మార్గమైనటువంటి పరిపాలన కొనసాగిందన్నారు. తను కలలుగన్న ఉస్మానిస్తాన్ గా నైజాం రాజ్యాన్ని మార్చాలని బయటి రాష్ట్రాల నుండి ముస్లింలను హైదరాబాద్కు తెచ్చి జనసంఖ్యను పెంచి వారి తోటి గ్రామాల మీద అరాచకాలు సృష్టించిన దుర్మార్గుడు నిజాం అని ఆయన అన్నారు. అంతే కాకుండా ఇక్కడ హిందువులను మతమార్పిడీ చేసి ఉద్యోగాల కల్పన పేరిట వారిని రజాకారుల సైన్యంలో చేర్చుకున్న దుర్మార్గుడు నిజాం అన్నారు. ఆనాటి ఊరి పేర్లను కూడా ముస్లిం పేర్లుగా మార్చిన పరమత ద్వేషి నిజాం అని ఆయన అన్నారు. ఇక్కడి ప్రజల నుండి వసూలు చేసిన పన్నులను ఢిల్లీ జామా మసీదు నిర్మాణానికి అదేవిధంగా అలీఘర్లో నిర్మాణం చేస్తున్న ముస్లిం విశ్వవిద్యాలయానికి విరాళంగా ఇచ్చాడన్నారు. తాను స్వతంత్ర దేశంగా ఉండేందుకు పాకిస్తాన్ సహకరిస్తుందన్న ఉద్దేశంతో 20 కోట్ల రూపాయలు పాకిస్థాన్కు విరాళంగా ఇచ్చిన ద్వేషి నిజాం అని ఆయన విమర్శించారు. నిజాం కొనసాగిస్తున్న ఈ అమానుషమైన పరిపాలన చూసి ఆర్య సమాజ్, ఆంధ్ర మహాసభ, స్టేట్ కాంగ్రెస్, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ లాంటి సంస్థలు అనేక ఉద్యమాలను నిర్మాణం చేసి నిజాముకు వ్యతిరేకంగా పోరాటాలు ప్రారంభించాయి అని ఆయన అన్నారు. ఆనాడు కవులు, కళాకారులు కూడా నిజాంకు వ్యతిరేకంగా పాటలు రాయడం, రచనలు చేయడం లాంటి పనులు చేసి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని ఆయన అన్నారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత పరకాలలోని చాపలబండ తండా వద్ద జాతీయ జెండా ఎగురవేస్తుంటే జియావుల్ అనేటువంటి రజాకారుల నాయకుడు వారిపై కాల్పులు జరిపించి ఆరుగురిని చంపి వేయించిన దుర్మార్గుడని ఆయన అన్నారు. అదేవిధంగా వీర బైరాన్ పల్లి ప్రజలు నిజాం సైన్యంపై తిరుగుబాటు చేస్తే అక్కడికక్కడే ఆ గ్రామంలోని 92 మందిని వరుసగా నిలబెట్టి కాల్చి చంపి ఆ ఊరిని వల్లకాడుగా మార్చి మరో జలియన్వాలాబాగ్ లాంటి సంఘటన సృష్టించినటువంటి పరమ దుర్మార్గుడు కాసిం రజ్వి, నిజాం అని ఆయన విమర్శించారు. పాలమూరు జిల్లా అప్పనపల్లి అనే గ్రామంలో రజాకార్లు ఆ గ్రామంలో ఉన్న పురుషులందరినీ చంపివేస్తే వారి భార్యలు తమ మంగళ సూత్రాలను తీసి రెండు బస్తాల నిండుగా నింపి బావిలో దాచారని ఆయన చెప్పారు .ఇలాంటి అనేక అమానుషకాండలకు పాల్పడుతున్నటువంటి నిజామును ఏ విధంగానైనా అంతం అందించాలని వరంగల్ నుండి ఆర్య సమాజ్ ద్వారా ప్రేరణ పొందిన నారాయణరావు పవార్ అనే యువకుడు హైదరాబాద్ వెళ్లి నిజాంపై బాంబు వేసి ఆయనను తుద ముట్టించాలని ప్రయత్నించి విఫలుడయ్యాడని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా వరంగల్ కోటలో ప్రతి వారం జాతీయ పతాకాన్ని ఎగరవేసే మొగిలయ్య గౌడ్ ఇంటిపై రజాకారులు దాడి చేసి ఆయనను కిరాతకంగా నరికి చంపి వేశారన్నారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా ఇమ్రోజ్ అనే పత్రికలో వార్తలు రాస్తున్న సొంత మతానికి చెందిన షోయబుల్లాఖాన్ ను కూడా చాపల్ బజార్లో చంపేసి ఆ తర్వాత ఆయన చేతులు నరికి వేసిన మూరు?డు నిజాం తొత్తు ఖాసిం రజ్వి అని ఆయన పేర్కొన్నారు. ఈ విధంగా అనేకమైనటువంటి హిందూ వ్యతిరేక దుశ్చర్యలు కొనసాగిస్తూ ఉంటే ఇది చూసి సహించలేని ఆనాటి హెూం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఏ విధంగానైనా భారత్ యూనియన్ లో హైదరాబాద్ సంస్థానాన్ని విలీనం చేయాలని 1948 సెప్టెంబర్ 14న పోలీస్ చర్యను ప్రారంభించడంతో చివరికి భారత సైన్యం దాటికి తాళలేక 1948 సెప్టెంబర్ 17న ఏడవనిజం మీరు ఉస్మాన్ అలీ ఖాన్ హైదరాబాద్ సంస్థానాన్ని భారత్ యూనియన్ లో విలీనం చేసిన నెహ్రూ సహకారంతో ప్రాణాలు దక్కించుకున్నాడు అని ఆయన అన్నారు. ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ ముందు నిజాం లొంగిపోయిన 1948 సెప్టెంబర్ 17 నైజాం సంస్థానంలో ఉన్న ప్రజలకు నిజమైన స్వతంత్రం వచ్చిన రోజు అని ఆయన అన్నారు. ఆనాటి వేలాదిమంది యువతీ యువకుల బలిదానం కారణంగా నైజాం సంస్థానం భారత్ యూనియన్ లో విలీనం అయిందని, వారి ఆదర్శాలే మనకు ప్రేరణగా ఉండాలని ఆయన యువకులకు సూచించారు. నిజమైనటువంటి చరిత్రను యువకులు అధ్యయనం చేసి విషయాలను తెలుసుకోవాలని ఆయన సూచించారు. యువతీ యువకులు సమాజంలో మూడు విషయాలను మర్చిపోకూడదని తమకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను, తను పుట్టి ,పెరిగిన ధర్మాన్ని అదేవిధంగా తాము పుట్టిన నేలను మర్చిపోకూడదని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నైజాం విముక్త స్వాతంత్ర అమృత ఉత్సవ సమితి, హనుమకొండ జిల్లా కార్యాధ్యక్షులు ప్రొఫెసర్ విజయబాబు, ప్రధాన కార్యదర్శి సుధీర్ ఆర్య, కోశాధికారి వేణు రెడ్డి, ఉపాధ్యక్షులు పాక శ్రీనివాస్, కార్యదర్శులు గోపు అమరేందర్ రెడ్డి , తక్కల్లపల్లి బుచ్చిబాబు, బండి మల్లేశం, డాక్టర్ రాజేందర్, డాక్టర్ రమాకాంత్ ,సి.హెచ్. సత్యనారాయణ, ఉత్సవ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాడి బాబురావు, ఆర్ఎస్ఎస్ విభాగ్ సంఘ చాలక్ ఆచార్య చిలకమారి సంజీవ, వరంగల్ మహానగర సంఘ చాలక్ డాక్టర్ బందెల మోహన్ రావు లతోపాటు జిల్లా అనుమకొండ జిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన ఐదువేల పైచిలుకు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా కాశీబుగ్గలోని వివేకానంద విద్యా కేంద్ర విద్యార్థినీ ,విద్యార్థులు విష్ణు ఆధ్వర్యంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.



# అధికారులు విద్యార్థులపై కక్షపూరితమైన చర్యలు ఎందుకు..?

- మా హక్కుల కోసం పోరాటం చేస్తే బ్లాక్ మెయిల్ చేసున్నారు
- వీసీ డాం డాం రిజిస్టర్ డాం డాం నినాదాలు చేస్తున్న విద్యార్థులు

కాకతీయ విశ్వవిద్యాలయం ప్రాంగణం (ఫస్ట్ గేట్) ఈ రోజు నిరసనలు, ధర్నాలతో దద్దరిల్లింది. గత ఎన్నో సంవత్సరాలుగా పోతన హాస్టల్లో ఉంటున్న అబ్బాయిలకు ఉన్నపళంగా ఖాళీ చేయించి, విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారని యూనివర్సిటీ విద్యార్థులు ఆరోపించారు. పోతన హాస్టల్లో భద్రతా ప్రమాణాలు అంతంత మాత్రమే అన్నారు. ఎటువంటి కాంపౌండ్ రక్షణ లేకుండా ఉన్నదాన్ని అమ్మాయిలకు ఇవ్వడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. బాయ్స్ ఉన్న పోతన హాస్టల్లో నీటిని, విద్యుత్ను నిలిపివేయడం అమానుషమన్నారు. యధావిధిగా బాయ్సని పోతన హాస్టల్లోనే కొనసాగించాలని ఉదయం 9 గంటల నుంచి రాత్రి వరకు శాంతియుతంగా ధర్నా చేస్తున్నారు.ధర్నా చేస్తే, స్ట్రైక్ నిర్వహించే వారిని సస్పెండ్ చేస్తామంటూ బెదిరిస్తున్నారని వాపోయారు. మేము మా హక్కులడిగితే ఇలా బెదిరిస్తారా అని ఆరోపించారు. వీసీ, రిజిస్ట్రార్ల వైఖరి విద్యార్థులకు అనుకూలంగా లేదని, ప్రోత్సహించే స్వభావం అసలే.. లేదంటూ నినాదాలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ ఎస్ఐ. రాజ్ కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో పోతన హాస్టల్ విద్యార్థులు ఉన్నారు.



# నందివనపర్తి మార్కెట్ యార్డ్ నిర్మాణానికి నిధులు మంజూరు

**10 లక్షల నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డి**



**ఇబ్రహీంపట్నం** :యాచారం మండలంలోని నందివనపర్తి గ్రామ పంచాయతీ కి ఎమ్మెల్యే నిధుల నుండి మార్కెట్ యార్డ్ నిర్మాణానికి 10,00,000 రూపాయలను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి మంజూరు చేశారు ఉత్వరులను తెరాస సీనియర్ నాయకులు బిలకంటి శేఖర్ రెడ్డి కి అందించడం జరిగింది. ఈ సందర్భంగా శేఖర్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసే ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి కి నందివనపర్తి గ్రామ ప్రజల తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెరాస మండల అధ్యక్షులు రమేష్ గౌడ్ నందివనపర్తి మాజీ సర్పంచ్ తెరాస నాయకులు రాజునాయక్ ,గణేష్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published & Owned by Sri N.C. Shekar.Corporate Office : Rama Krishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India.RNI-TELTEL/2017/72695,Editor :N.C.Shekar.Cell :7799911110.Email:subhatelangana@gmail. com